సాక్షి
సిద్దిపేట
మంగళవారం । 19 । డిసెంబర్ । 2023

న్యూస్‌రీల్

జుంబా డ్యాన్స్‌తో ఎంతో మేలు

స్టూడియో ప్రారంభించిన హరీశ్‌రావు



స్టూడియోను ప్రారంభిస్తున్న హరీశ్‌రావు. చిత్రంలో జెడ్పీచైర్ పర్సన్ రోజాశర్మ తదితరులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జుంబా డ్యాన్స్‌తో శరీరాన్ని ఫిట్‌గా ఉంచుకోవడంతో పాటు ఆరోగ్యానికి మేలు చేస్తుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట పట్టణంలో తొలిసారిగా జుంబా డాన్స్ స్టూడియోను హరీశ్‌రావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం అన్నారు. రోజూ వ్యాయామం, వాకింగ్ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ రోజా శర్మ, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, మోహన్‌లాల్, కొండం సంపత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సంఘం శరణం గచ్ఛామి నాటక ప్రదర్శన

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): డాక్టర్ అంబేడ్కర్ జీవితం, ఆశయం, లక్ష్యాలపైన 'సంఘం శరణం గచ్ఛామి' అనే నాటకాన్ని సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్‌లలో ప్రదర్శించనున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ అధికారి కవిత సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కమిషనర్ రాహుల్ బొజ్జ ఆదేశాల మేరకు అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నాటక ప్రదర్శనలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెల 19న గజ్వేల్ పట్టణంలోని మహతి ఆడిటోరియంలో, 20న బాలుర ఉన్నత పాఠశాల హుస్నాబాద్‌లో, 21న సిద్దిపేట పట్టణంలోని విపంచి ఆడిటోరియంలో సాయంత్రం వేళ నాటక ప్రదర్శన నిర్వహించనున్నట్లు తెలిపారు.

ముందస్తు వేడుకలు



విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా ముస్తాబయిన మెథడిస్ట్ చర్చి

జహీరాబాద్ టౌన్: కరుణామయుడైన ఏసు క్రీస్తు జన్మదిన వేడుకలు పట్టణంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. క్రిస్మస్ పర్వదినం కోసం చర్చిలన్నీ సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. పట్టణంలోని అతిపెద్దదైన మెథడిస్టు చర్చిని దీపాలతో అలంకరించారు. క్రైస్తవులంతా ముందస్తు వేడుకలను జరుపుకుంటున్నారు. చర్చిల వద్ద భారీ క్రిస్మస్ ట్రీలను ఏర్పాటు చేశారు. అందంగా ముస్తాబైన చర్చిలు, క్రిస్మస్ ట్రీలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. క్రైస్తవులంతా ఇమ ఇళ్ల ముందు స్టార్ దీపాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. కొత్త బట్టలు, తదితర వస్తువుల కొనుగోళ్లతో మార్కెట్‌లో సందడి నెలకుంది.

తలమీద బోనం.. ఉప్పొంగిన భక్తిభావం



మద్రి గ్రామంలో బోనాల ఊరేగింపు

కోహీర్(జహీరాబాద్): మండలంలోని మద్రి గ్రామంలో వెలసిన భ్రమరాంబ మల్లికార్జున స్వామి సట్టి జాతరను సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సట్టిబండ్ల ఆలయ ప్రదక్షిణలు కనువిందు చేశాయి. అనంతరం భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అంతకుముందు స్వామివారి కల్యాణం కనులపండువగా నిర్వహించారు. గ్రామ దేవతలతో పాటు, భ్రమరాంబ మల్లికార్జునస్వామికి బోనం సమర్పించారు. భక్తులకు అన్నదానం చేశారు.

ఏడుపాయల హుండీ లెక్కింపు

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల ఆలయ హుండీని లెక్కించారు. భక్తుల సమర్పించిన కానుకల ద్వారా రూ.53,36,886 ఆదాయం వచ్చినట్లు ఈఓ మోహన్‌రెడ్డి సోమవారం తెలిపారు. ధర్మాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ శివరాజ్, ఇన్‌స్పెక్టర్ రంగారావు పాలక మండలి చైర్మన్ బాలగౌడ్‌ల సమక్షంలో గోకుల్‌షెడ్‌లో లెక్కింపు జరిగింది. భవానీ మాతను పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తన అనుచరులతో కలిసి దర్శించుకున్నారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తజనులు



సుబ్రహ్మణ్యేశ్వరుని కల్యాణం సందర్భంగా మంగళసూత్రాలు చూపుతున్న వేదపండితులు


వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి మహోత్సవం

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- వర్గల్ క్షేత్రంలో వెల్లివిరిసిన ఆధ్యాత్మికం

వర్గల్(గజ్వేల్): సుప్రసిద్ధ వర్గల్ విద్యాసరస్వతి క్షేత్రం కల్యాణ శోభతో అలరారింది. సోమవారం సుబ్రహ్మణ్య షష్ఠి మహోత్సవ వేడుకలతో ఆధ్యాత్మికత ఉప్పొంగింది. వేదపండితులు, బ్రాహ్మణోత్తముల మంత్రోచ్ఛరణల మధ్య అంగరంగ వైభవంగా జరిగిన సుబ్రహ్మణ్యస్వామివారి కల్యాణ మహోత్సవంతో భక్తిభావనలు వెల్లివిరిశాయి. ఉదయం 6 గంటలకు ఆలయ వ్యవస్థాపకులు యాయవరం చంద్రశేఖర సిద్ధాంతి అధ్వర్యంలో వేదపండిత పరివారం సుబ్రహ్మణ్యషష్ఠి మహోత్సవ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. గర్భగుడిలో కొలువైన వల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామివారికి విశేష పంచామృతాభిషేకం జరిపారు. అలంకార సేవ చేశారు. అనంతరం ఉదయం 8 గంటలకు మూల మంత్ర హవనం నిర్వహించారు. ఉదయం 10 గంటలకు స్వామివారి కల్యాణోత్సవం ప్రారంభమైంది. అక్షరాభ్యాస మహామండపంలో ప్రత్యేకంగా తీర్చిదిద్దిన కల్యాణవేదికపై ఉత్సవ మూర్తులను ఆసీనులను చేశారు. అనంతరం వేదపండితులు వేద మంత్రాలతో వల్లీ దేవసేన, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారల ఎదుర్కోళ్లు, యజ్ఞోపవిత ధారణ, కంకణధారణ, జీలకర బెల్లం ధారణ తదితర వివాహ తంతు నిర్వహించారు. సుముహూర్త వేళ స్వామివారు దేవేరులకు మాంగళ్యధారణ చేశారు. ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. కమనీయంగా సాగిన కల్యాణ వైభోగాన్ని భక్త జనులు తిలకించి పరవశించారు. కట్నకానుకలు, ఒడిబియ్యం సమర్పించి స్వామి వారి ఆశీస్సులు పొందారు. నేత్రపర్వంగా సాగిన ఈ మహోత్సవాన్ని వివిధ ప్రాంతాల నుంచి భారీసంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యక్షంగా తిలకించి తరించారు. మహాప్రసాదం స్వీకరించారు.

సీఎంఆర్ పూర్తయ్యేదెన్నడో?

- మూడు సార్లు గడువు పొడిగించినా పూర్తికాని వైనం
- వానాకాలం సీజన్ 81శాతమే అప్పగింత
- 19 శాతం మిల్లర్ల వద్దనే పెండింగ్
- మిల్లుల్లో ధాన్యం నిల్వలపై అనుమానాలు



రామునిపట్లలోని ఓ రైస్ మిల్లులో బియ్యం

సాక్షి, సిద్దిపేట: ముచ్చటగా మూడు మార్లు గడువు పొడిగించినా సీఎంఆర్‌ను రైస్ మిల్లర్లు అందించడం లేదు. ప్రభుత్వం అందించిన ధాన్యాన్ని మరపట్టి బియ్యంగా అందించే ప్రక్రియలో రైస్ మిల్లర్లు తీవ్ర జాప్యం చేస్తున్నారు. ప్రతీ ఏడాది రైతుల నుంచి కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం బియ్యంగా మర పట్టి ఇచ్చేందుకు కస్టమ్ రైస్ మిల్లింగ్ (సీఎంఆర్) కింద మిల్లులకు కేటాయిస్తుంది. ఇలా ధాన్యాన్ని బియ్యంగా మార్చి మిల్లర్లు పౌరసరఫరాల శాఖకు అప్పగించాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం కేటాయించిన 45 నుంచి 60 రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి కావాలి. అయితే ప్రభుత్వానికి బియ్యం అప్పగించడంలో మిల్లర్లు జాప్యం చేస్తున్నారు. ఈ నెల 31వ తేదీతో మూడో సారి గడువు ముగయనుంది. ఇప్పటి వరకు 81.48శాతం సీఎంఆర్‌ను మాత్రమే అందించారు.

తీవ్ర జాప్యం

జిల్లాలో వానాకాలం (2022–23) సీజన్‌లో 3,62,193 టన్నుల ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేశారు. సీఎంఆర్ కింద 144 రైస్ మిల్లుకు ధాన్యం కేటాయించారు. కేటాయించిన ధాన్యంలో బాయిల్ అయితే 68 శాతం, రా రైస్ అయితే 67శాతం బియ్యంగా మార్చి తిరిగి పౌర సరఫరాల శాఖకు అప్పగించాలి. ఇలా 2,43,850 మెట్రిక్ టన్నుల బియ్యం అందించాల్సి ఉండగా ఇప్పటి వరకు 1,98,679 టన్నుల బియ్యం మాత్రమే అందించారు. ఇంకా 45,171 టన్నుల బియ్యం మిల్లర్లు అప్పగించాల్సి ఉంది. ప్రభుత్వం విధించిన గడువు మరో 11 రోజుల్లో ముగియనుంది. ఈ సారి గడువులోగా సైతం సీఎంఆర్ పూర్తయ్యే అవకాశాలు కన్పించడం లేదు.

మిల్లర్ల మాయాజాలమా?

రైతుల నుంచి సేకరించి సీఎంఆర్ కోసం రైస్ మిల్లులకు ఇచ్చిన ధాన్యం నిల్వలు అసలు ఉన్నాయా లేవా? అని అనుమానాలు రేకెత్తుతున్నాయి. గతంలో హుస్నాబాద్‌లోని ఓ మిల్లులో ధాన్యం బహిరంగ మార్కెట్‌లో విక్రయించడంతో సదరు మిల్లు యజమానిపై సివిల్ సప్లయ్ అధికారులు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఆ యజమానిపై రెవెన్యూ యాక్టును సైతం అమలు చేశారు. సీఎంఆర్ జాప్యానికి మిల్లర్ల మాయాజాలమే కారణమన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

జరిమానా చెల్లించని మిల్లర్లు

2021–22కి సంబంధించి 22 మిల్లులు 9వేల మెట్రిక్ టన్నుల బియ్యం బకాయి ఉండటంతో 125 శాతంతో బియ్యం అందించాలని నోటీసులను జారీ చేశారు. దీంతో మిల్లర్లు కేవలం బియ్యం మాత్రమే అందించి జరిమానాను ఇప్పటి వరకు చెల్లించలేదు. జరిమానా వసూళ్లపై అధికారులు దృష్టి పెట్టకపోవడంతో మిల్లర్లు సీఎంఆర్‌ను సైతం ఆలస్యం చేస్తున్నారని తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు దృష్టి సారిస్తేనే త్వరగా పూర్తయ్యే అవకాశం ఉంటుంది.

యాసంగి సీఎంఆర్

యాసంగిలో 3,52,417 టన్నుల ధాన్యాన్ని జిల్లా రైతుల మంచి ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఈ ధాన్యం 82 మిల్లులకు అప్పగించారు. 2,47,557 టన్నుల బియ్యం అందించాల్సి ఉండగా ఇప్పటి వరకు 37,439 టన్నుల బియ్యం మాత్రమే అందించారు. ఇంకా 2,10,118 టన్నుల బియ్యం రైస్ మిల్లర్లు అప్పగించాల్సి ఉంది.

గడువులోగా పూర్తి చేయాల్సిందే

ప్రభుత్వం విధించిన గడువు ఈ నెల 31తో ముగియనుంది. సీఎంఆర్ అందించని మిల్లర్లపై ప్రభుత్వం ఆదేశాలతో చర్యలు తీసుకుంటాం. ప్రతీ నెల ధాన్యం తనిఖీలు చేస్తున్నాం.

– జె. హరీశ్, డీఎం, సివిల్ సప్లయ్ కార్పొరేషన్

మెదక్‌కు దామోదర.. జహీరాబాద్‌కు సుదర్శన్‌రెడ్డి

పార్లమెంట్ ఇన్‌చార్జిలను ప్రకటించిన కాంగ్రెస్



దామోదర రాజనర్సింహ



పి.సుదర్శన్‌రెడ్డి

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: రానున్న పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్‌పార్టీ ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జిలను నియమిస్తూ నిర్ణయం తీసుకుంది. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గం ఇన్‌చార్జి రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను నియమించింది. అందోల్ నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న దామోదరకు మెదక్ బాధ్యతలు అప్పగించింది. అలాగే జహీరాబాద్ నియోజకవర్గం ఇన్‌చార్జిగా మాజీ మంత్రి పి.సుదర్శన్‌రెడ్డిని ప్రకటించింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో సుదర్శన్‌రెడ్డి నిజామాబాద్ జిల్లా బోధన్ నియోజవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని బోధన్, జుక్కల్, బాన్సువాడ, కామారెడ్డి నియోజకవర్గాలతో పాటు, సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్, అందోల్(ఎస్సీ), జహీరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గాలు జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఉన్నాయి. మెదక్ పార్లమెంట్ పరిధిలో మెదక్, నర్సాపూర్, గజ్వేల్, సిద్దిపేట్, సంగారెడ్డి, పటాన్‌చెరు అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. మరో రెండు, మూడు నెలల్లో పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశాలుండడంతో కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జిలను నియమించింది.

బిగ్‌బాస్ విన్నర్ ప్రశాంత్‌కు ఘనస్వాగతం



గజ్వేల్‌లో ర్యాలీగా వస్తున్న పల్లవి ప్రశాంత్

భారీ సంఖ్యలో తరలివచ్చిన అభిమానులు

గజ్వేల్‌రూరల్: బిగ్‌బాస్ సీజన్‌- 7 విన్నర్ పల్లవి ప్రశాంత్‌కు అభిమానులు ఘనస్వాగతం పలికారు. 105 రోజుల పాటు సాగిన బిగ్‌బాస్ హౌస్‌లోకి రైతుబిడ్డగా ఎంట్రీ ఇచ్చిన పల్లవి ప్రశాంత్ విజేతగా నిలిచి తన స్వగ్రామమైన గజ్వేల్ మండలం కొల్గూరుకు సోమవారం చేరుకున్నారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ వద్ద అభిమానులు బాణాసంచా కాల్చి ఘనస్వాగతం పలికారు. ప్రజ్ఞాపూర్ నుంచి గజ్వేల్ పట్టణంలోని ఇందిరాపార్కు చౌరస్తా మీదుగా తిరిగి వివేకానంద చౌరస్తా నుంచి పిడిచెడ్ రోడ్డు మార్గంగుండా కొల్గూరు వరకు భారీ సంఖ్యలో అభిమానులు ర్యాలీ నిర్వహించారు. పట్టణంలో గజమాలతో స్వాగతం పలికారు. యువత, అభిమానులు నినాదాలను హోరెత్తిస్తూ ముందుకు సాగారు. కొల్గూరులో పల్లవి ప్రశాంత్ ఇంటి వద్ద సందడి వాతావరణం నెలకొన్నది. కాగా ప్రజ్ఞాపూర్ నుంచి గజ్వేల్ పట్టణం మీదుగా పిడిచెడ్ రోడ్డు వైపు పల్లవి ప్రశాంత్ ర్యాలీగా తరలివెళ్తున్న క్రమంలో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గజ్వేల్ వరకు ర్యాలీ వస్తున్న సమయంలో స్కూల్ విద్యార్థులతో వచ్చే బస్సులు, ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

రేపు జిల్లాస్థాయి సైక్లింగ్ ఎంపిక పోటీలు

అక్కన్నపేట(హుస్నాబాద్): అంతక్కపేటలో ఈ నెల 20న జిల్లాస్థాయి సైక్లింగ్ ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, వెంకటనర్సయ్య సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలు మత్రికుంట కట్ట దగ్గర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా అండర్ 14, 16, 18 యూత్, మెన్ అండ్ ఉమెన్ విభాగాలలో నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా కేంద్రంలోని రంగనాయక సాగర్ మీద ఈ నెల 22, 23, 24వ తేదీల్లో జరిగే ఎనిమిదవ రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రాలతో ఉదయం 9గంటలకు హాజరు కావాలన్నారు.

జీపీ రికార్డుల తనిఖీలు



మాచాపూర్‌లో జీపీ రికార్డులు తనిఖీ చేస్తున్న సిబ్బంది

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని మాచాపూర్ గ్రామ పంచాయతీ రికార్డులను సోమవారం కౌన్సిల్ ఫర్ సిటిజెన్ రైట్స్(సీసీఆర్) సంస్థ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. సమాచార హక్కు చట్టం ప్రకారం గతంలోనే రికార్డుల తనిఖీకి అనుమతి పొందామని సంస్థ జిల్లా అధ్యక్షుడు గుండ్ల శివచంద్రం పేర్కొన్నారు. ఈ సందర్భంగా సంస్థ సెంట్రల్ కమిటీ సభ్యులు చంద్రకాంత్ మాట్లాడుతూ పారదర్శక పాలనే లక్ష్యంగా సీసీఆర్ పని చేస్తోందన్నారు. ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించేందుకు, అవినీతి రహిత సమాజాన్ని స్థాపించే విధంగా తమ సంస్థ కృషి చేస్తుందన్నారు. రికార్డుల తనిఖీకి సంబంధించి అవకతవకలను గుర్తిస్తే త్వరలోనే నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు భరద్వాజ్, ఫారూఖ్ అలీ, రత్నాకర్, రాజు, ఆంజనేయులు పాల్గొన్నారు.

మగ్గంవర్క్‌పై ఉచిత శిక్షణ

తొగుట(దుబ్బాక): ఘనపురంలో మగ్గంవర్క్‌పై ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ఐకేపీ ఏపీఎం మగ్దూం అలి సోమవారం ప్రారంభించారు. నాబార్డు సహకారంతో ఐడీఎల్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో మహిళలు, యువతులకు 15 రోజుల పాటు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు. ఏపీఎం మాట్లాడుతూ ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిక్షణ పూర్తిచేసుకున్న తర్వాత బ్యాంకు నుంచి రుణాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ కోంద్ర రాజలింగం మాట్లాడుతూ శిక్షణ కాలంలో మహిళలకు మధ్యాహ్న భోజనంతో పాటు రూ.750 స్టైఫండ్ అందిస్తామని చెప్పారు.



మాట్లాడుతున్న విద్యార్థి, ప్రజా సంఘాల నాయకులు

ఉపా కేసులు ఎత్తివేయండి

సిద్దిపేటకమాన్: గత ప్రభుత్వం తమపై అక్రమంగా నమోదు చేసిన ఉపా కేసులను ఎత్తివేయాలని ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. కేసుల్లో భాగంగా సిద్దిపేట కోర్టుకు సోమవారం వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్రం సాధించుకున్న తర్వాత ప్రజా, విద్యార్థి, రైతాంగ వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేసీఆర్ పాలనకు వ్యతిరేకంగా తాము మాట్లాడినందుకు అక్రమంగా ఉపా కేసులు నమోదు చేశారన్నారు. 10 కేసులలో విద్యార్థి, ప్రజా, పౌర హక్కుల, మహిళ సంఘాల నాయకులను ఇరికించారన్నారు. తమపై నమోదైన అక్రమ కేసులను పరిశీలించి ఎత్తివేయాలని వారు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు. అప్పటి కేసీఆర్ ప్రభుత్వం కుట్రపూరితంగా రాష్ట్రంలో పనిచేస్తున్న అనేక సంఘాల నాయకులను, విద్యార్థి, మహిళ, రచయితల, కళాకారుల సంఘాల కార్యకర్తలపైన కేసులు బనాయించారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా, విద్యార్థి సంఘాల నాయకులు శ్రీనివాస్, బద్రి, రాజు, జాన్, రవిచంద్ర, రాఘవాచారి, రాము, సత్యం, సమీర్, పురుషోత్తం తదితరులు ఉన్నారు.

విద్యాభివృద్ధిపై న్యాక్ బృందం ఆరా

- ప్రభుత్వ డిగ్రీ కళాశాల సందర్శన
- విద్యార్థులతో సమావేశమై వివరాల సేకరణ



బృందం సభ్యులకు నివేదికలు చూపిస్తున్న కామర్స్ విభాగాధిపతి డాక్టర్ గోపాలసుదర్శనం

సిద్దిపేటఎడ్యుకేషన్: సిద్దిపేట ప్రభుత్వ అటానమస్ డిగ్రీ కళాశాలను సోమవారం న్యాక్ బృందం సందర్శించింది. ప్రతి ఐదేళ్లకు ఒకసారి జరిగే కార్యక్రమంలో భాగంగా సందర్శించి కళాశాల చేపట్టిన కార్యక్రమాలు, విద్యాభివృద్ధికి తీసుకుంటున్న చర్యల గూర్చి తెలుసుకున్నారు. బృందం చైర్‌పర్సన్ ప్రొఫెసర్ హోషియా ధామి, సభ్యులు ప్రొఫెసర్ బ్రజ్ భూషణ్ ఓజా, కో ఆర్డినేటర్‌డాక్టర్ అయ్యప్పిళ్లై సెల్వకుమార్‌లు కళాశాలలోని వివిధ విభాగాలను సందర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ సంయుక్త సంచాలకులు ప్రొఫెసర్ రాజేంద్రసింగ్ ఈ సందర్శనలో పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సీహెచ్ ప్రసాద్ సభ్యులకు కళాశాల ప్రగతిని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. కళాశాల ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ మధుసూదన్.. కళాశాలలో నాణ్యమైన విద్యను బోధించుటకు తీసుకున్న చర్యలను బృందానికి వివరించారు. బృందం చైర్మన్, సభ్యులు విడివిడిగా 18 విభాగాలను సందర్శించి అవసరమైన సూచనలు చేశారు. ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, ఉమెన్ ఎంపవర్‌మెంట్, పర్యావరణ సంబంధిత స్టాల్స్‌తోపాటు సైన్స్ ల్యాబ్‌లను సందర్శించి సూచనలు, సలహాలను అందించారు. అనంతరం కళాశాల పూర్వవిద్యార్థులు, ప్రస్తుత విద్యార్థులతో విడివిడిగా సమావేశమై వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సిహెచ్ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ వాసం శ్రీనివాస్, న్యాక్ కోఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్ మధుసూదన్, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ గోపాల సుదర్శనం, డాక్టర్ పల్లవి, జి రవికుమార్, ఇ శ్రీనివాస్‌రావు, డాక్టర్ పి. అయోధ్యరెడ్డి, ఎం శ్యాంసుందర్‌తో పాటు వివిధ విభాగాధిపతులు, తెలుగుసాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ నందిని సిద్ధారెడ్డి, పూర్వవిద్యార్థుల సంఘం అధ్యక్షుడు పాపయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభ...



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, సర్పంచ్ ఉపేందర్

పటాన్‌చెరుటౌన్: ముత్తంగి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు మార్షల్ ఆర్ట్స్‌లో ప్రతిభ చాటారు. ఆదివారం మహబూబ్‌నగర్‌లో శ్రీ హనుమాన్ కరాటే ఆసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన నేషనల్ కరాటే చాంపియన్ షిప్‌లో జిల్లా పరిషత్ హైస్కూల్ ముత్తంగి విద్యార్థులు మెడల్స్, సర్టిఫికెట్లను సాధించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం, ముత్తంగి సర్పంచ్ ఉపేందర్, ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు.

పెన్షనర్లకు అండగా ఉంటాం

జిల్లా ట్రెజరీ అధికారి బాలరాజు



మాట్లాడుతున్న బాలరాజు

సిద్దిపేటకమాన్: పెన్షనర్లకు తమ శాఖ పక్షాన ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉంటామని జిల్లా ట్రెజరీ అధికారి బాలరాజు అన్నారు. అఖిల భారత పింఛనుదారుల దినోత్సవాన్ని సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో సోమవారం నిర్వహించారు. మొదట పెన్షన్ల సాధనకు కృషి చేసిన డీఎస్ నకారా చిత్రపటానికి పూలమాల వేశారు. కార్యక్రమానికి హాజరైన ట్రెజరీ అధికారి మాట్లాడుతూ.. పెన్షనర్లకు అండగా ఉంటామని, సకాలంలో జీవన ప్రమాణ పత్రాలు, ఇతర సర్టిఫికెట్లు సమర్పించాలన్నారు. వృద్ధ పెన్షనర్లకు సంఘం చేస్తున్న సేవలను, సామాజిక కార్యక్రమాలను సంఘం జిల్లా అధ్యక్షుడు వివరించారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ మేనేజర్ మంజిత్‌కౌర్, రాజిరెడ్డి, మహంకాళీ, రాములు, భూంరెడ్డి, గాల్‌రెడ్డి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



స్వామిని అభినందిస్తున్న పాఠశాల సిబ్బంది

గజ్వేల్‌రూరల్: జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీలో గల జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన విద్యార్థి బి.స్వామి ఎంపికైనట్లు ఆ పాఠశాల పీఈటీ గోవర్ధన్ రెడ్డి తెలిపారు. సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎస్‌జీఎఫ్ (స్కూల్ గేమ్స్ ఫెడరేషన్) ఆధ్వర్యంలో ఈనెల 13 నుంచి 15 వరకు మహబూబ్‌నగర్ జిల్లా నారాయణరావుపేటలో అండర్-14 విభాగంలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రతిభను చాటినట్లు పేర్కొన్నారు. జాతీయ స్థాయిలో ఈనెల 22 నుంచి 25 వరకు ఒరిస్సాలో జరుగబోయే పోటీల్లో పాల్గొంటాడని పేర్కొన్నారు. స్వామిని పాఠశాల హెచ్ఎం కరీమొద్దీన్ అభినందించారు.

బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక




వికాస్

జోగిపేట (అందోల్): పంజాబ్ రాష్ట్రంలోని పట్యాలలో జనవరి 6 నుంచి 11 వరకు జరిగే స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ స్థాయి పోటీలకు ఎస్ఆర్ఎం కళాశాలకు చెందిన ద్వితీయ సంవత్సరం విద్యార్థి దమ్మ వికాస్ ఎంపికైనట్లు అందోల్ స్పోర్ట్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు, కోచ్ వీబీ శ్రీనివాసులు తెలిపారు. ఇటీవల మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగిన రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు తరఫున పాల్గొని జట్టుకి సారథిగా ఉండి అత్యధిక గోల్స్ చేసినట్లు పేర్కొన్నారు.



పొదుపుగా వాడేస్తాను..

ఒకప్పుడు పంటకు నీరు పెట్టాలంటే మధ్యలో కాల్వలు తీసి సరఫరా చేసేవారు. కానీ రోజు రోజుకూ పెరుగుతున్న పరిజ్ఞానంతో రైతులు స్ప్రింక్లర్లు ఏర్పాటు చేసి నీటి పొదుపును పాటిస్తున్నారు. మిట్టపల్లి గ్రామశివారులో ఆకులతోటకు స్ప్రింక్లర్లతో నీటిని పెట్టడం సాక్షి కెమెరా కంటపడింది.



టక్కున మింగేస్తాను..

జీవకోటిలో ఆకలి తెలియని జీవి ఉండదు. ఓ చిట్టి పక్షి తన తోపాటు గాలిలో ఎగురుతున్న తేనే టీగను చిటుక్కున పట్టుకుంది. ఈ క్రమంలోనే ముక్కునుండి జారిపోతుండగా మళ్లీ పట్టుకొని మింగేసింది. ఈ దృశ్యాలను వెల్కటూరు గ్రామశివారులో సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది.

–స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట

డిగ్రీ కోర్సులు ఆధునీకరణ

ప్రొఫెసర్ రాజేందర్‌సింగ్

సిద్దిపేట ఎడ్యుకేషన్: సంపాదనతోపాటు చదువు అనే ఉద్దేశంతో నైపుణ్య రంగాలను ప్రోత్సహిస్తూ, మారుతున్న కాలానికి అనుగుణంగా డిగ్రీ కోర్సులను ఆధునీకరణ చేస్తున్నట్లు ఉన్నత విద్యాశాఖ సంయుక్త సంచాలకులు ప్రొఫెసర్ రాజేంద్రసింగ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ అటానమస్ కళాశాలను సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెండేళ్ల నుంచి మెట్రోపాలిటన్ నగరంలాంటి హైదరాబాద్‌తోపాటు, వివిధ జిల్లాలో కళాశాలలో బీబీఏ లాజిస్టిక్స్, బీబీఏ రిటైల్ మార్కెటింగ్, బీబీఏ అగ్రికల్చర్ వంటి ఉపాధి కోర్సులను ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా గతేడాది విద్యార్థులు ట్రైనింగ్‌కు వెళ్లగా, మూడు రోజులు కళాశాల, మూడు రోజులు వివిధ కంపెనీలు ట్రైనింగ్ ఇవ్వడంతో విద్యార్థులు నెలకు రూ.7వేలు నుంచి రూ.11 వేల వేతనం సంపాదిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 145 ప్రభుత్వ డిగ్రీ కళాశాలు ఉన్నాయి. వీటిలో 54 వేర్వేరు సబ్జెక్ట్ కాంబినేషన్లతో వివిధ డిగ్రీ ప్రోగ్రామ్‌లలో విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని అన్నారు. ప్రభుత్వ కళాశాలను బలోపేతం చేస్తూ, ప్రైవేటు కళాశాలలకు దీటుగా గ్రామీణ విద్యార్థులకు మెరుగైన విద్యను అందించడం జరుగుతుందన్నారు. బోధన సిబ్బందిని బోధనతోపాటు, పరిశోధన వైపు ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేలు ప్రోత్సాహకంగా అందిస్తుందన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న రాజేందర్‌సింగ్

అవినీతి రహిత పాలనే లక్ష్యం

మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

చిన్నశంకరంపేట(మెదక్): అవినీతి రహిత పాలన కోసం పని చేస్తానని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ అన్నారు. సోమవారం పేట మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు కరప్షన్ ఫ్రీ పాలన అందిస్తా అని, అధికారులు సైతం ఎవరికీ రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేదన్నారు. ప్రజల కోసం పనిచేస్తూ వారి సమస్యలను సత్వరం తీర్చేందుకు అధికారులు సహకరించాలని కోరారు. సమస్యల గురించి ఎప్పుడైనా తనకు ఫోన్ చేయొచ్చని అందరికీ అందుబాటులో ఉంటానన్నారు. అంతకుముందు అధికారులు తమ శాఖల పరిధిలో జరుగుతున్న పనుల వివరాలు, సమస్యలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆవుల భాగ్యలక్ష్మి, చిన్నశంకరంపేట సర్పంచ్ రాజిరెడ్డి, ఎంపీడీఓ ప్రవీణ్, తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రోహిత్

పొన్నంను కలిసిన మల్లన్న ఆలయ అర్చకులు



మంత్రి పొన్నం ప్రభాకర్‌కు చిత్రపటాన్ని అందజేస్తున్న అర్చకులు

కొమురవెల్లి(సిద్దిపేట): రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం మంత్రిగా బాధ్యలు చేపట్టడంతో మల్లన్న ఆలయ ఈవో బాలాజీ ఆధ్వర్యంలో అర్చకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు స్వామి వారి ఆశీర్వచనం, ప్రసాదం, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు మహాదేవుని మల్లికార్జున్, స్థానచార్యులు పడిగన్నెగారి మల్లయ్య పాల్గొన్నారు.

చిత్రం గీసి శుభాకాంక్షలు



దుబ్బాకటౌన్: దుబ్బాక పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు కాముని మల్లికార్జున్ వాయిలెట్ కలర్‌తో రాష్ట్ర రవాణా శాఖ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చిత్రాన్ని గీసి ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. మల్లిక్ వేసిన మంత్రి చిత్రంను చూసి పలువురు అభినందించారు.

22న ఉమ్మడి జిల్లాస్థాయి వెయిట్ లిఫ్టింగ్ ఎంపికలు

సంగారెడ్డి అర్బన్: పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీన ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్ అండర్ 17 బాలురు, బాలికల ఎంపికలు సెయింట్ ఆంథోని పాఠశాల, శాంతినగర్, సంగారెడ్డిలో నిర్వహించనున్నట్లు జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య కార్యదర్శి అమూల్యమ్మ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలకు సంబంధించి ఉమ్మడి మెదక్ జిల్లా విద్యార్థులు ఒరిజినల్ బోనఫైడ్‌లతో ఉదయం 9 గంటలకు హాజరు కావాలని సూచించారు. మిగితా వివరాలకు 91772 50577, 83092 64140 నంబర్లను సంప్రదించాలని కోరారు.

దుర్గమ్మ దర్శనానికి వచ్చి..

ఏడుపాయల్లో నీట మునిగి భక్తుడు మృతి



బస్వరాజ్ మృతదేహం

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల దుర్గమ్మ దర్శనం కోసం వచ్చిన కర్ణాటక రాష్ట్ర భక్తుడు మంజీరా నదిలో మునిగి మృతిచెందాడు. ఎస్ఐ మహిపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం బిడుగుప్ప మండలం బీదర్ జిల్లా కర్కవెల్లి గ్రామానికి చెందిన శంకు బస్వరాజ్ (50) తన తల్లి, భార్య పిల్లలతో కలిసి సోమవారం దుర్గమ్మ దర్శనం కోసం వచ్చారు. స్నానం కోసం చెక్ డ్యామ్ ఆవలి వైపునకు వెళ్లి నీటిలో దిగగానే పిట్స్ వచ్చి మునిగిపోయాడు. కుటుంబ సభ్యులు రక్షించడానికి ప్రయత్నించేలోపే చనిపోయాడు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

దౌల్తాబాద్(దుబ్బాక): అనునిత్యం కార్యకర్తలకు అండగా ఉంటానని దుబ్బాక ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఇందుప్రియాల్‌లో పార్టీ కార్యకర్త పోతరాజు వెంకటేష్ కొద్ది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఎమ్మెల్యే మృతుడి కుటుంబాన్ని సోమవారం పరామర్శించి పార్టీ సభ్యత్వ బీమా రూ.2 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కార్యకర్తలు అధైర్యపడొద్దని ఆపద సమయంలో అండగా ఉంటానన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకటరెడ్డి, ఎంపీటీసీలు మల్లేశం, దేవేందర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, నాయకులు కుమార్, నాగరాజు, యాదగిరి, షాదుల్లా, భాస్కర్, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

ఆపన్నహస్తం కోసం ఎదురుచూపు

- గుండె వ్యాధితో బాధపడుతున్న యువకుడు
- వైద్యానికి రూ.5 లక్షలకు పైగా ఖర్చు
- దాతలు ఆదుకోవాలంటూ తల్లి వేడుకోలు

దుబ్బాకటౌన్: రెక్కాడితే గాని డొక్కాడని పేద కుటుంబం.. ఎలాంటి ఆస్తిపాస్తులు లేవు.. పొద్దస్తమానం కూలి పనులు చేస్తే గాని పూట గడువని కుటుంబం. ఇంతలోనే వారి జీవితాన్ని విధి పగబట్టింది. ఆ ఇంట్లో 18 ఏళ్ల యువకుడు గుండె సంబంధిత వ్యాధులతో చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నాడు. ఆస్పత్రిలో వైద్యం చేయించేందుకు చిల్లి గవ్వకూడా లేకపోవడంతో తీవ్ర అనారోగ్యానికి గురై మంచానికే పరిమితం అయ్యాడు. చేతికొచ్చిన కుమారుడి పరిస్థితి చూసి ఆ తల్లి బాధ అంతా ఇంతా కాదు. ఎవరైనా దాతలు సాయం చేసి తన కుమారుడిని బతికించాలని ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్నారు.

దుబ్బాక మున్సిపాల్టీ పరిధిలోని దుంపలపల్లికి చెందిన ఎద్దు చంద్రవ్వ కుమారుడు ప్రశాంత్(18) కొద్ది రోజుల కిందట తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. తల్లి అప్పు చేసి ఆస్పత్రిలో చూపించగా ప్రశాంత్ గుండెకు హోల్ ఉండడంతోపాటు పలు రకాల సమస్యలు ఉన్నట్లు వైద్యులు గుర్తించారు. ప్రశాంత్ గుండెకు సంబంధించిన వ్యాధుల సర్జరీ తప్పనిసరిగా చేయించాలని సూచించారు. ఇందుకు గాను రూ.5 లక్షలకు పైగా ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. అసలే పేద కుటుంబం కూలి పని చేస్తేనే గాని కుటుంబం గడిచే పరిస్థితి ఉండదు. అంత డబ్బు ఎక్కడి నుంచి తేవాలని ఆ తల్లి కుమారుడి పరిస్థితి చూస్తూ తల్లడిల్లుతోంది. ప్రశాంత్ చిన్నప్పుడే తండ్రి వదిలేసి వెళ్లిపోగా, ఆర్థిక స్థోమత లేక ఆరవ తరగతి వరకే చదువుకున్న ప్రశాంత్ తర్వాత తల్లికి చేదోడువాదోడుగా ఉంటున్నాడు.



ప్రశాంత్

ఆదుకునే దాతలు..

సంబంధించి వైద్యం కోసం ప్రశాంత్‌ను ఆదుకునే దాతలు ఈ కింది నంబర్లను సంప్రదించాలి. ఫోన్ పే, గూగుల్ పే నంబర్లు 97045 19706 లేదా 95055 26030లకు లేదా అకౌంట్ నంబర్లు 62283275493 లను సంప్రదించాలని కోరారు.

నిస్సాహాయకుడికి చేయూత..

రెండు కృత్రిమ చేతులు అమరిక

రామాయంపేట(మెదక్): విద్యుత్ ప్రమాదంలో రెండు చేతులు కోల్పోయిన ఓ వ్యక్తికి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ ఏలేటి రాజశేఖర్‌రెడ్డి చేయూత అందించారు. వివరాల్లోకి వెళ్తే.. రామాయంపేటలో నివాసం ఉంటున్న సందిరి రవి రెండేళ్ల కిందట కరెంట్ షాక్‌తో రెండు చేతులు కోల్పోయాడు. తన పని తాను చేసుకోలేని దుస్థితిలో ఇబ్బంది పడుతున్నాడు. రవిని ఆదుకోవాలని నిర్ణయించుకున్న రాజశేఖర్‌రెడ్డి అక్టోబర్ 26న హైదరాబాద్‌లో ఇనాలీ ఫౌండేషన్, పూణె రోటరీ క్లబ్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వారు నిర్వహించిన ప్రత్యేక శిబిరానికి తీసుకెళ్లారు. అక్కడ రెండు చేతులకు సంబంధించి కొలతలు తీసుకొని కృత్రిమ చేతులు తయారు చేయించారు. ఈ రెండు కృత్రిమ చేతులను సోమవారం రవికి అమర్చారు. దీంతో రవి వారికి కృతజ్ఞతలు తెలిపారు.



కృత్రిమ చేతులు అమర్చిన రవితో రాజశేఖర్‌రెడ్డి

చెరువులో మునిగి వ్యక్తి మృతి



గంగాధర్ మృతదేహం

చేగుంట(తూప్రాన్): ప్రమాదవశాత్తు చెరువులో మునిగి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని వడియారం గ్రామంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన తాళ్లపల్లి గంగాధర్(76) స్నానం చేసేందుకు ఊర చెరువులోకి వెళ్లాడు. బట్టలు ఉతికి స్నానం చేసే క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో మునిగిపోయాడు. గమనించిన స్థానికులు జాలరుల సాయంతో గంగాధర్ మృతదేహాన్ని బయటకు తీశారు. గంగాధర్ రైల్వే ఉద్యోగిగా పనిచేసి విరమణ పొందగా ఇంటి వద్దే ఉంటున్నాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. మృతుడి కుమారుడు భానుచందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని రామాయంపేట ప్రభుత్వాస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఎస్ఐ హరీశ్ తెలిపారు.

యువతి అదృశ్యం



రేష్మ

దుబ్బాకటౌన్: యువతి అదృశ్యమైన ఘటన దుబ్బాక పట్టణంలో సోమవారం చోటుచేసుకుంది. సీఐ మున్నూరు కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన సోమారపు రేణుక రెండో కూతురు రేష్మ (19) ఆదివారం రాత్రి తల్లిదండ్రులతో కలిసి భోజనం చేసి ఇంట్లోనే పడుకుంది. సోమవారం తెల్లవారు జామున చూసేసరికి రేష్మ కనిపించకుండా పోయింది. ఆమె కోసం చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారి ఇంటి పక్కనే ఉండే ఓ యువకుడిపై అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. మిస్సింగ్ కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కృష్ణ తెలిపారు.

బిస్కెట్ ప్యాకెట్ కొనుక్కొని వస్తుండగా..

- గుర్తు తెలియని వాహనం ఢీ
- ఓ వ్యక్తి, నాలుగేళ్ల బాలుడు మృతి
- పటాన్‌చెరులో ఘటన

పటాన్‌చెరు టౌన్: బిస్కెట్ ప్యాకెట్ కొనేందుకు వెళ్లి తిరిగి వస్తూ రోడ్డు దాటుతుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ వ్యక్తితోపాటు నాలుగేళ్ల బాలుడు చెందాడు. ఈ ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. అస్సాం రాష్ట్రానికి చెందిన అబేద్ అలీ బతుకుదెరువు కోసం పటాన్‌చెరు మండలం ముత్తంగికి వలస వచ్చాడు. స్థానికంగా ఉన్న వేంకటేశ్వర బ్రిక్స్ కంపెనీలో పని చేసుకుంటూ పక్కనే గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్నారు. వీరు పనిచేసే చోట బీహార్‌కు చెందిన సోనుకుమార్ అలియాస్ మునిలాల్(38) పని చేసుకుంటూ అక్కడే గుడిసెలో ఉంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం రాత్రి సోనుకుమార్, అబేద్ అలీ కుమారుడు రంజన్ అలీ(4)ని తీసుకొని బిస్కెట్ ప్యాకెట్ కొనేందుకు దుకాణానికి రోడ్డు దాటి వెళ్లాడు. బిస్కెట్ ప్యాకెట్ తీసుకొని తిరిగి రోడ్డు దాటుతుండగా పటాన్‌చెరు వైపు నుంచి సంగారెడ్డి వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలై సోనుకుమార్, బాలుడు రంజన్ అలీ అక్కడికక్కడే మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



సోనుకుమార్ (ఫైల్) రంజన్ అలీ(ఫైల్)

అనుమానాస్పద స్థితిలో ఇద్దరు మృతి

వేర్వేరు చోట్ల అనుమానాస్పద స్థితిలో ఇద్దరు మృతి చెందారు. సిద్దిపేటలో ఒకరు మృతి చెందగా, మెదక్‌లో గృహిణి మృతి చెందారు.

సిద్దిపేటఅర్బన్: అనుమానాస్పదంగా వ్యక్తి మృతి చెందిన ఘటన సిద్దిపేట అర్బన్ మండలం తడ్కపల్లిలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. దండు శ్రీనివాస్(35) వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఆదివారం రాత్రి గ్రామానికి చెందిన తన స్నేహితులతో కలిసి పేకాట ఆడుతున్న సందర్భంలో మరో వ్యక్తితో గొడవ జరిగింది. పక్కన ఉన్న వారు గొడవను ఆపారు. శ్రీనివాస్‌ను గ్రామానికి చెందిన వ్యక్తి తన ఆటోలో ఇంటికి తీసుకొచ్చాడు. ఆ సమయంలో శ్రీనివాస్ స్పృహ కోల్పోయి, నోటిలో నుంచి నురగ రావడంతో అదే ఆటోలో సిద్దిపేట ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. శ్రీనివాస్ మృతిపై తమకు అనుమానం ఉందని విచారణ జరిపి న్యాయం చేయాలని అతడి భార్య రాధ ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గృహిణి మృతి

మెదక్ మున్సిపాలిటీ: అనుమానాస్పదస్థితిలో ఓ గృహిణి మృతి చెందిన ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మెదక్ పట్టణ సీఐ వెంకటేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ పట్టణంలోని పిల్లికోటాల్‌కు చెందిన నాచారం మరియమ్మ (41) ఈ నెల 16వ తేదీన రాత్రి ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కుటుంబీకులు ఈనెల 17న పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే పిల్లికోటాల్ శివారులో గల పిల్లికుంట వద్ద సోమవారం మరియమ్మ చెప్పులు కనిపించాయి. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు కుంటలో వెతుకగా మృతదేహం లభ్యమైంది. మృతదేహం తలపై గాయం ఉండడంతో అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు మెదక్ టౌన్ సీఐ తెలిపారు.



శ్రీనివాస్ (ఫైల్) మరియమ్మ (ఫైల్)

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం



మహిళ మృతదేహం

పటాన్‌చెరు టౌన్: గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైన ఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ గ్రామ పరిధిలో మానసిక స్థితి సరిగా లేని మహిళా (35-40 ఏళ్లు) భిక్షాటన చేసుకుంటూ అమీన్‌పూర్ పరిధిలో తిరుగుతూ ఉండేది. సోమవారం ఉదయం గ్రామ పరిధిలోని ఎండీ అంజద్‌కు చెందిన ఖాళీ స్థలంలో పడుకున్న చోటే మృతిచెంది కనిపించింది. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలికి సంబంధించిన బంధువులు ఉంటే అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని తెలిపారు.

ఆటో, బైక్ ఢీ

ఒకరికి తీవ్ర గాయాలు

కొమురవెల్లి(సిద్దిపేట): ఆటో, బైక్ ఢీకొనడంతోఒకరికి తీవ్ర గాయాలైన ఘటన మండలంలోని లెనిన్ నగర్ శివారులో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. సోమవారం కొమురవెల్లి ఎస్ఐ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. చేర్యాల పట్టణానికి చెందిన మన్నె కర్ణాకర్ హైదరాబాద్‌లో ఉంటూ కారు డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం చేర్యాలకు దుర్గమ్మ పండుగ కోసం వచ్చాడు. లెనిన్ నగర్‌లో బంధువులను దింపి చేర్యాలకు బైక్‌పై వెళ్తున్నాడు. షణ్ముఖ గార్డెన్ సమీపంలోకి రాగానే రాంగ్ రూట్‌లో వచ్చిన ఆటో బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కర్ణాకర్‌కు తీవ్రగాయాలు అయ్యాయి. అతడి తమ్ముడు నరేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.